క్లుప్తంగా

నేడు రైతులకు వీడియో కాన్ఫరెన్స్

మునగాల : రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మునగాల మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం పది గంటలకు రైతులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి బుంగా రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'వానాకాలంలో పంటల సాగుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు' అనే అంశంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు తమ అభిప్రాయాలు తెలియజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని రైతులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బాలకోటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నడిగూడెం : మండలంలోని వల్లాపురం రెవెన్యూ పరిధిలో గల శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ స్వామివారికి అర్చకులు ఇంగువ సంగమేశ్వర ప్రసాద్ శర్మ రుద్రాభిషేకం చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలగాని దేవేందర్, నూకపంగు వెంకన్న, ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, గ్రామపెద్దలు నల్లా భూపాల్‌రెడ్డి, సభ్యులు మేక యాదగిరి, కిన్నెర కోటయ్య, భక్తులు పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి



చెన్నాయిపాలెంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంజీనాయక్

మఠంపల్లి : ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మఠంపల్లి మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్ అన్నారు. సోమవారం మండలంలోని వరదాపురంలో రోడ్డులో కింది తండా వద్ద నిర్మాణంలో ఉన్న వంతెనను, చెన్నాయిపాలెం సమీపంలో నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు, పునర్నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ పనులను ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. రెండు గ్రామాల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్యా నాగునాయక్, నాయకులు రవీందర్‌నాయక్, గోవర్ధన్‌నాయక్, బానోతు లక్కియానాయక్, గ్రామపెద్దలు సోమ్లానాయక్, శ్రీనునాయక్, వెంకటేశ్వర్లునాయక్, హనుమాన్‌సింగ్, సైదులుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమాలకు సహాయం అందించాలి



సామగ్రి అందజేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన పచ్చిపాల సాయిగోపి పుట్టినరోజును పురస్కరించుకొని సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమానికి రూ.18వేల విలువ గల రైస్ కుక్కర్, ఎలక్ట్రికల్ స్టవ్ అందజేశారు. ఈ సందర్భంగా దాత సాయిగోపి మాట్లాడుతూ ఆశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలతో పాటు సహాయ, సహకారాలు అందజేసి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీబిందు, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

బీజేపీ పాలన ప్రమాదకరం

నడిగూడెం : దేశంలో బీజేపీ పాలన ప్రమాదకరంగా మారిందని సీపీఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ఆరోపించారు. సోమవారం నడిగూడెం మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామంలో జరిగిన సీపీఎం మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో బీజేపీ దేశంలో ప్రమాదకర పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. బీజేపీ.. పార్లమెంటు వ్యవస్థలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందన్నారు. మావోయిస్టుల బూటకపు ఎన్‌కౌంటర్ తగదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, జిల్లా నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఎస్‌కె.సైదా హుస్సేన్, ఏనుగుల వీరాంజనేయులు, లతీఫ్, తిరపయ్య, సైదులు, పిచ్చయ్య, వెంకన్న, పాల్గొన్నారు.

గ్రామాలకు మహర్దశ



ఎకలాస్‌ఖాన్‌పేట తండాలో పూర్తయిన సీసీ రోడ్డు



కరివిరాలలో శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు



నడిగూడెం ఎస్సీ కాలనీలో నిర్మించిన డ్రెయినేజీ

- 1.60 కోట్లతో అభివృద్ధి పనులు
- సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

నడిగూడెం : మండలంలోని గ్రామాలకు మహర్దశ పట్టింది. మండల కేంద్రంతో పాటు బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం, నారాయణపురం, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, చాకిరాల, రత్నవరం, తెల్లబల్లి, ఎకలాస్‌ఖాన్‌పేట, ఎకలాస్‌ఖాన్‌పేట తండాలలో సీసీ రహదారులు, డ్రెయినేజీల నిర్మాణానికి గ్రామానికి రూ.10 లక్షల చొప్పున మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.1.60 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో మండల వ్యాప్తంగా చేపట్టిన సీసీ రహదారులు, డ్రెయినేజీల పనులు 90 శాతం పూర్తయ్యాయి. ఇప్పటి వరకు రూ.1.40 కోట్ల పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామ పంచాయతీల వారీగా ప్రాధాన్యతను బట్టి సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటివరకు చేసిన పనులకు నిధులు మంజూరైన తర్వాత మిగతా పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ సీసీ రహదారుల నిర్మాణంతో ప్రజల సమస్య పరిష్కారమైంది. ముఖ్యంగా కరివిరాల గ్రామం నుంచి శ్మశాన వాటికకు వెళ్లాలంటే లోతైన గుంతలు, కంపచెట్లు ఉండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. సీసీ రహదారి నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభించిందని ప్రజలు అంటున్నారు. మండల వ్యాప్తంగా సీసీ రహదారులు, డ్రెయినేజీలు నిర్మిస్తుండడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డ్రెయినేజీ నిర్మాణంతో ఇబ్బందులు తొలిగాయి



ఇటీవల మా కాలనీలో ఉపాధి హామీ పథకం నిధులతో డ్రెయినేజీ నిర్మించారు. గతంలో ఇళ్ల ముందు మురుగు నీరు నిలిచి నానా ఇబ్బందులు పడేవాళ్లం. నిత్యం దుర్వాసన వెదజల్లేది. మురుగు కాల్వ నిర్మాణంతో ఇబ్బందులు తొలిగాయి.

– కొత్తపల్లి వెంకట మహేంద్ర వర్మ, నడిగూడెం

ఇన్నాళ్లు అవస్థలు పడ్డాం



మా గ్రామంలోని ఎస్సీ కాలనీలో అంతర్గత రహదారుల సమస్య ఉన్నది. లోతైన గుంతలతో రాకపోకలకు ఇన్నాళ్లు అవస్థలు పడ్డాం. ఇటీవల ప్రభుత్వం సీసీ రహదారి నిర్మించింది. ఆనందంగా ఉంది.

– సంపతి బాబు, వేణుగోపాలపురం

విద్యకు పదిశాతం నిధులు కేటాయించాలి

- మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



హుజూర్‌నగర్ : ప్రచార జాతలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నేరేడుచర్ల : కేంద్ర బడ్జెట్‌లో విద్యకు పది శాతం నిధులు కేటాయించి విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సోమవారం నేరేడుచర్లలో నిర్వహించిన తెలంగాణ పౌర స్పందన ప్రచార వేదిక ప్రచార జాతాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతుల ఏర్పాటు కోసం ఐదు వేల కోట్ల ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందన్నారు. ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని బలోపేతం చేయాలన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి చైర్మన్‌గా ఉన్న తెలంగాణ విద్యా కమిషన్ పాఠశాలలో మార్పుల గురించి 21 పేజీల రిపోర్టును ప్రభుత్వానికి అందించిందని కానీ నేటికీ ఆ రిపోర్టుపై ఎలాంటి స్పందన లేదన్నారు. కార్యక్రమంలో పౌర స్పందన ప్రచార వేదిక సభ్యులు ధనమూర్తి, భిక్షపతి, సుంకరి క్రాంతికుమార్, అనిల్‌కుమార్, మంగ, సాంబయ్య, నాగేశ్వర్‌రావు, జిలకర రామస్వామి, అక్కయ్యబాబు, శ్రీనయ్య, రవీందర్‌రెడ్డి, నర్సింహారావు, సైదానాయక్ ఉన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పు రావాలి

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో మార్పు రావాలని మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ పౌర స్పందన వేదిక చేపట్టిన ప్రచార జాత సోమవారం హుజూర్‌నగర్ చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నవారు, లేనివారు పిల్లలైనా ఒకే బడిలో చదువుకోవాలనే లక్ష్యంతో తెలంగాణ పౌర స్పందన పనిచేస్తుందని చెప్పారు. బడి ఈడు పిల్లల సంఖ్య ఆధారంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొత్త బడులు ప్రారంభించాలని కోరారు. ఆవాస గ్రామాల నుంచి బడికి వచ్చే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు మంగ, నాగమణి, ధనమూర్తి, వెంకటరెడ్డి, పి.వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



నేరేడుచర్ల : మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు మధు



చిలుకూరు : నారాయణపురంలో ర్యాలీ తీస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నట్లు నేరేడుచర్ల, పెంచికల్‌దిన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, ఎల్. శ్రీనివాస్ అన్నారు. సోమవారం నేరేడుచర్ల, పెంచికల్‌దిన్నలలో జెడ్పీహెచ్ఎస్‌ల ఉపాధ్యాయులు నిర్వహించిన బాడి బాట కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల్లో అర్హత, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తారని తెలిపారు. డిజిటల్ తరగతులు, క్రమ శిక్షణ, విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు బోధిస్తామని పేర్కొన్నారు. పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోనే వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నేరేడుచర్ల ఏఏపీ చైర్మన్ ఇంజమూరి శ్రావణి, ఉపాధ్యాయులు గోపయ్య, సైదులు, లింగయ్య, అలివేలు, ఎల్లమ్మ, నాగజ్యోతి, ఎం. యాదగిరి, బాలు, లాల్‌సాహెబ్, సరస్వతి, వెంకటేశ్వర్‌రావు, ఉపేందర్, సృజన, సీఆర్‌పీలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, అంగన్‌వాడీ టీచర్లు ఇంజమూరి ఉపేంద్ర, జయమ్మ, సమభావన సంఘాల మహిళలు రోజా, నాగలక్ష్మి, కళ్యాణి, ఆర్పీ సరిత, నాగమణి తదితరులు ఉన్నారు.

బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

చిలుకూరు : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు గుజ్జుల నరసింహారెడ్డి కోరారు. సోమవారం చిలుకూరు మండల పరిధిలోని నారాయణపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు ఉన్నాయని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడికి సన్మానం

హుజూర్‌నగర్ : పద్మశాలి సంఘం హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన బొడ్డు గోవిందరావును సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు డి.శ్రీనివాసరావు, జి.అంజి, జి.దీప, ఆర్.వెంకటేశ్వర్లు, నరసింహచారి, కె.కృష్ణ, బి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కోదాడ: కోదాడలోని సీసీరెడ్డి విద్యానిలయంలో ఆదివారం ప్రారంభమైన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు సోమవారం ముగిసాయి. ఈ పోటీల్లో నల్లగొండ జట్టు ప్రథమ స్థానంలో, కోదాడ జట్టు ద్వితీయ స్థానం, హుజూర్‌నగర్ జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లామ్ దేవరాజ్ తెలిపారు. విజేతలకు కోదాడ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు పిల్లుట్ల శ్రీనివాస్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కందుల చంద్రశేఖర్, తుమ్మ జోసఫ్‌రెడ్డి, బొలిశెట్టి రాము, ఎబినేజర్, వినయ్‌భాస్కర్, హేమంత్‌సాయి, అర్జున్, గోపి, రామన్నతో పాటు బాస్కెట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏపీలోని ఆయిల్‌పామ్ తోటల పరిశీలన



హుజూర్‌నగర్ : అంపాపురంలో ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న రైతులు, అధికారులు

హుజూర్‌నగర్, మఠంపల్లి : హుజూర్‌నగర్ డివిజన్ పరిధిలోని మఠంపల్లి మండలం రఘునాథపాలెం, వెంకటాయపాలెం, చింతలపాలెం మండల కేంద్రంతో పాటు తదితర మండలాలకు చెందిన ఆయిల్ పామ్ రైతులు ఆయిల్ పామ్ తోటల సాగులో మెళకువలు తెలుసుకునేందుకు సోమవారం ఏపీలోని కృష్ణా జిల్లా అంపాపురం గ్రామంలో ఆయిల్ పామ్ తోటల క్షేత్ర సందర్శనకు వెళ్లారు. ఈ పర్యటనను డివిజన్ హార్టికల్చర్ అధికారి ప్రదీప్తి జెండా ఊపి ప్రారంభించారు. క్షేత్ర సందర్శన నుంచి వచ్చిన అనంతరం మఠంపల్లి పీఏసీఎస్ చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తున్న రైతులతో కలిసి తోటలను పరిశీలించామన్నారు. పంటసాగులో ఉండే కష్టనష్టాలతో పాటు సాగులో మెళకువలు, పంట దిగుబడి, పంట అమ్ముకునే విధానంపై అక్కడి రైతులను అడిగి వివరాలు సేకరించామని తెలిపారు. అంపాపురంలో ఉన్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని కూడా సందర్శించి అక్కడి అధికారులు, సిబ్బందితో కూడా మాట్లాడామన్నారు. కార్యక్రమంలో పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ జిల్లా మేనేజర్ జే. హరీష్, ఫీల్డ్ ఆఫీసర్ సాయి, క్షేత్ర సహాయకుడు రవి, రైతులు ఎస్‌కె.సైదా, గురువారెడ్డి, నరసింహారెడ్డి, ఎస్‌కె.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక



శ్యాముల్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

మునగాల : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చెస్ పోటీల్లో మునగాల మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన జిల్లేపల్లి లింగయ్య –నాగేంద్ర దంపతుల కుమారుడు శ్యాముల్ (11) అండర్– 13 విభాగంలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శ్యాముల్ కోదాడలోని తేజ టాలెంట్ స్కూల్‌లో ఐదవ తరగతి పూర్తి చేశాడు. చిన్నతనం నుంచి చెస్ ఆటపై శ్యాముల్ ఆసక్తి కనబరచడంతో తండ్రి లింగయ్య ప్రోత్సహించాడు. తన కుమారుడు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆనందంగా ఉందని తండ్రి లింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా శ్యాముల్‌ను సోమవారం పలువురు గ్రామస్తులు అభినందించారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, వేనేపల్లి వీరబాబు, కీత రమేష్, జిల్లేపల్లి బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

కుమారి మృతి పార్టీకి తీరని లోటు



కుమారి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మట్టిపల్లి సైదులు, నాయకులు

మునగాల : మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ములకలపల్లి రాములు సతీమణి, పార్టీ సభ్యురాలు కుమారి మృతి సీపీఎంకు తీరని లోటని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు అన్నారు. సోమవారం కొక్కిరేణిలో రాములును ఆయన పరామర్శించారు. ముందుగా కుమారి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దేవరం వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ జంపాల స్వరాజ్యం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆరె.రామకృష్ణారెడ్డి, సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి నందిగామ సైదులు ఉన్నారు.

రాములుకు పరామర్శ..

ములకలపల్లి రాములును సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు నల్లపాటి శ్రీనివాస్ పరామర్శించారు. కుమారి మృతిపట్ల సంతాపం ప్రకటించి నివాళులు అర్పించారు.

పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలి



హెచ్ఎంలకు యూనిఫాం అందజేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లావణ్య

హుజూర్‌నగర్‌రూరల్ : పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పిండిప్రోలు లావణ్య కోరారు. సోమవారం హుజూర్‌నగర్ మండలంలోని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు విద్యార్థుల యూనిఫాంను మహిళా సమాఖ్య భవనం వద్ద మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం స్వరూప, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నారసింహుని నిత్యకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర నామార్చనలు, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభంధనం, రుత్విగ్వరణం, మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, సీతారామచార్యులు, రాజేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డి జీవితం ఆదర్శనీయం



వెంకటరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్ : తన జీవిత కాలం సీపీఎం కోసం కృషి చేసిన వ్యక్తి పులిచింతల వెంకటరెడ్డి అని, ఆయన జీవితం ఆదర్శనీయమని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి అన్నారు. సోమవారం పి.వెంకటరెడ్డి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దుగ్గి బ్రహ్మం, వి.సైదులు, పి.హుస్సేన్, శీలం శ్రీను, లక్ష్మమ్మ, నరేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, మురళి, వెంకటరెడ్డి, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

తాళ్లగడ్డ (సూర్యాపేట) : కార్యకర్తలకు కొండంత అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. జేతూనాయక్ తండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నూనావత్ కిషన్ నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షల నగదును అతడి సతీమణి సుగుణమ్మకు సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ జెడ్పీటీసీ జీడి భిక్షం, ఉప్పల సైదులు, సురేందర్ నాయక్, విజయ్, చింతలపాటి మధు, బొడ్డు కిరణ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఆనాటి ఉపాధ్యాయులు

మునగాల : మండలంలోని నర్సింహులగూడెంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004– 2005 విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు ఎం.వెంకన్న, జి.రమేష్‌బాబు, కరుణశ్రీ, యూన్సీరాణి, రామాంజమ్మ, ఆర్.బుచ్చిరెడ్డి, ఎం.అంజయ్య, భారతి, రెడ్యానాయక్, లామేరి, అనురాధ పూర్వ విద్యార్థులు కత్తి నాగరాజు, ఎం.శివ, ఎ.రమేష్, ఆర్.శ్వేత, ఇందిర, శైలజ, మహేశ్వరి, రాజేష్, కిరణ్, అమీద్ పాల్గొన్నారు.

ఘనంగా బాలగురప్ప జాతర



ఆలయం వద్ద భక్తుల సందడి

నడిగూడెం : మండలంలోని రామాపురం గ్రామ చెరువు వెంట 150 ఏళ్ల నాటి మర్రిచెట్టు కింద వెలసిన బాలగురప్ప ఆలయం వద్ద జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. కాగా, మూడేళ్లకోకసారి జాతర నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. కార్యక్రమంలో పూజారులు గంధం కోటయ్య, వెంకటేశ్వర్లు, మల్లయ్య, భక్తులు పాల్గొన్నారు.

వెదజల్లినట్టు.. సాగు చేపట్టినట్టు

- మొలకెత్తిన కోత సమయంలో భూమిపై పడిన గింజలు



చిలుకూరులో వరి పంట కోసే సమయంలో నేలపై పడిన గింజలు మొలకెత్తిన దృశ్యం

చిలుకూరు : కనుచూపు మేర సాగు చేసిన పొలం అనుకుంటున్నారా.. కాదు, రబీ సీజన్‌లో పంట కోతల సమయంలో కోత మిషన్ నుంచి భూమిపై పడిన ధాన్యపు గింజలు మొలిచి భూమికి ఆకు పచ్చ రంగు వేసినట్లు కనిపిస్తోంది. చిలుకూరు గ్రామానికి చెందిన దొడ్డా నారాయణకు చిలుకూరు నుంచి దూదియాతండా వెళ్లే రోడ్డులో 9ఆర్ కాలువ పక్కన గల 5 ఎకరాల పొలంలో వరికొయ్యలు మురిగిపోవడం కోసం ఇటీవల ట్రాక్టర్‌తో దున్నాడు. దీనికి తోడు మూడు రోజుల క్రితం వర్షం కురిసింది. దీంతో పంట కోత సమయంలో వరి కోత మిషన్ నుంచి పడిన వరి గింజలు మొలకెత్తి వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేసినట్లు కనిపిస్తోంది.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జైలు

సూర్యాపేటటౌన్ : మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడిన ఆరుగురికి జైలు శిక్ష విధించినట్లు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం సోమవారం తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ 18 మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ ఇద్దరికి రెండు రోజులు, మరో నలుగురికి ఒక్క రోజు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా, మిగతా 12 మందికి కలిపి రూ.16,500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు.